సాక్షి సంగారెడ్డి

సోమవారం । 21 । జూలై । 2025


వట్‌పల్లిలో జరిగిన బోనాల ఉత్సవాల్లో కళాకారుల విన్యాసాలు

న్యూస్‌రీల్

పుష్పాంబరిగా వన దుర్గమ్మ



పాపన్నపేట(మెదక్): ఆషాఢమాసం చివరి ఆదివారం పుష్పాంబరిగా వన దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు. ఎల్లలు దాటి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ దుర్గమ్మను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రాజీవ్ విగ్రహం ఏర్పాటుకు వినతి


ఎంపీ షెట్కార్ వినతి పత్రం అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్: దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు మహిళా కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు. శనివారం మహిళా కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షురాలు అస్మా ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. వీరి డిమాండ్‌కు ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ...రాజీవ్ ప్రధానిగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు మమత, వహీదాబేగం, తుల్జమ్మ, చన్నుబీ, అనీస్‌బేగం, మారునిబాయి, సీతాబాయి, సుమిత్ర, పుణ్యమ్మ, అహ్మదీబేగం పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ


సదాశివపేటలో సీపీఐ జిల్లా మహా సభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సీపీఐ నాల్గవ మహాసభలను జిల్లాలోని నారాయణఖేడ్ పట్టణంలో ఆగస్టు 2,3వ తేదీల్లో జరుగనున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తాజోద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లా మహాసభలకు జిల్లాలోని నాయకులు కార్యకర్తలు భారీగ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రెహమాన్, బుజ్జమ్మ, పూలమ్మ, గంగమ్మ, లడ్డు, లక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణకు బీజేపీ చేసింది శూన్యం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణకు బీజేపీ చేసింది శూన్యమని, మియాపూర్, పటాన్‌చెరు మెట్రో రెండవ దశ పొడిగింపులో కేంద్ర నిధులు తీసుకురావడంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పూర్తిగా విఫలమయ్యారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కేంద్ర బీజేపీ మంత్రులు నాయకులు ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఔటర్‌రింగ్‌రోడ్డు, కంది ఐఐటీలను సందర్శిస్తున్నారని ఈ మూడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్టులేనని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు చేసింది శూన్యమన్నారు. హైదరాబాద్ మెట్రో రెండవ దశ పొడిగింపు ఏ, బీ కేటగిరీలో సుమారు రూ.40 వేల కోట్ల ఖర్చు అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటా 30% కేంద్ర బీజేపీ ప్రభుత్వ వాటా 18% ఉన్నప్పటికీ కేంద్రం నిధులు ఇవ్వకుండా తెలంగాణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. మెట్రో రైలు పొడిగింపు నిధులు తీసుకురావడంలో ఎంపీ రఘునందన్ రావు పూర్తిగా విఫలమయ్యారన్నారు విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు యువరాజ్, కార్మిక సంఘం నాయకులు అంజయ్య, రతన్‌సింగ్, మధు, శ్రీనివాస్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బోనంతో బైలెల్లి.. తల్లికి ప్రణమిల్లి

జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో వేడుకలు

- సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవార్ల విగ్రహాలతో శోభాయాత్ర
- రామచంద్రాపురంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు

సంగారెడ్డి/రామచంద్రాపురం(పటాన్‌చెరు)/వట్‌పల్లి(అందోల్): ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో జిల్లావ్యాప్తంగా ప్రజలు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఊరూవాడా తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించింది. మహిళలు అమ్మవారి గుడులకు బోనమెత్తి మొక్కులు సమర్పించుకున్నారు. బోనమెత్తిన మహిళలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు మేళాలతో వీధులన్నీ ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. బోనాల పండుగను పురస్కరించుకుని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అమ్మవార్ల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర కొత్తబస్టాండ్, రాంమందిర్ మీదుగా దుర్గమ్మగుడి వరకు సాగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారుల బృందం భారీ డోలు వాయిద్యాలతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. శివసత్తుల రూపంలో యువతులు భక్తి శ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి యువకులతో కలిసి నృత్యం చేశారు. ఇక రామచంద్రాపురం పట్టణంలో జరిగిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం శ్రీపోచమ్మ తల్లి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రామచంద్రాపురంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


వివిధ దేవతామూర్తుల వేషధారులతో జగ్గారెడ్డి




రామచంద్రాపురంలోని పోచమ్మతల్లి ఆలయంలో జరిగిన పూజల్లో కాటా శ్రీనివాస్ గౌడ్ తదితరులు

ఖేడ్‌కు విద్యుత్ వెలుగులు

రూ.25కోట్లతో 132కేవీ

- ఒక్కో 33/11కేవీకి రూ.2.50కోట్ల నుంచి రూ.3కోట్లు
- స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు
- త్వరలో తిమ్మాపూర్‌లో 33/11 కేవీ పనులు
- భవిష్యత్తులోనూ విద్యుత్ ఇబ్బందులు రాకుండా చర్యలు


132 కేవీ సబ్‌స్టేషన్ కోసం అంతర్‌గాం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: భవిష్యత్తులో విద్యుత్ ఇబ్బందులు రాకుండా చేపడుతున్న ముందు జాగ్రత్త చర్యలతో ఖేడ్ నియోజకవర్గం విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. మారుమూల ఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి చెందిన ప్రాంతాల సరసన విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని ఇదివరకే సీఎం ప్రకటించగా అందుకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వ్యవసాయానికి సైతం సరిపడా విద్యుత్ అందనుంది. రానున్న ఐదేళ్ల పాటు విద్యుత్ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు ప్రారంభించారు.

ఒక 132కేవీ, ఐదు 33/11కేవీ సబ్‌స్టేషన్లు..

ఖేడ్ నియోజకవర్గం (విద్యుత్ సబ్‌డివిజన్) పరిధిలో సుమారు 20వేల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, 48వేల గృహ విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఖేడ్‌లో ఒక 132కేవీ సబ్‌స్టేషన్‌తోపాటు 33/11కేవీ సబ్‌స్టేషన్లు 30 ఉన్నాయి. తాజాగా సిర్గాపూర్ మండలం నల్లవాగు- అంతర్‌గాం గ్రామాల మధ్య నూతన 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇది సుమారు రూ.20నుంచి రూ.25కోట్ల వ్యయంతో నిర్మాణం జరగనుంది. ఖేడ్ నుంచి భారీ విద్యుత్ టవర్లు నిర్మించి 20కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. సబ్‌స్టేషన్ కోసం అనువుగా ఉన్న 10ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులతో కలిసి ఇటీవల పరిశీలించారు. దీంతోపాటు నాగల్‌గిద్ద మండలం తిమ్మాపూర్ వద్ద 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరైంది. రూ.2.50కోట్లతో దీన్ని నిర్మాణం చేపట్టనున్నారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేయగా టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఈ సబ్‌స్టేషన్ నుంచి ఖేడ్ పట్టణంలోని పలు నూతన, పాత కాలనీలకు సైతం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి లోవోల్టేజీ, విద్యుత్ సమస్యలను నివారించనున్నారు. దీంతోపాటు ఖేడ్ పట్టణ శివారు, కంగ్టి మండలం బోర్గి, మనూరు మండలం రాయిపల్లి, నాగల్‌గిద్ద మండలం ఎకర్‌పల్లి గ్రామాల్లో నూతన 33/11కేవీ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదించారు.

కొత్త ఫీడర్లు, అదనపు లైన్లు..

తరచూ విద్యుత్ ఇబ్బందులు తలెత్తుతున్నందున కొత్త ఫీడర్ ఛానెల్స్, 11కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటు చేయనున్నారు. రాయిపల్లి గ్రామం గజ్వాడ, రాయికోడ్ నుంచి ఖేడ్ పట్టణానికి నూతన ఫీడర్ ఏర్పాటు చేయనున్నారు. శాంతి తండా నుంచి తడ్కల్‌కు కొత్త 11కేవీ లైన్ తడ్కల్, ఘన్‌పూర్ వరకు 17 గ్రామాల్లో సమస్య పరిష్కరించేందుకు 3కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఖేడ్ మండలం తుర్కాపల్లికి కొత్త ఫీడర్ ప్రతిపాదించారు. లోవోల్టేజీ సమస్య ఉన్నందున ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్, రహమాన్ కాలనీల్లో మూడు 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించనున్నారు. ర్యాలమడుగు 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు రూ.55లక్షల వ్యయంతో కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేసి చార్జీ చేశారు. దీంతో నాబ్లిమేట్, మూడుగుంటలు, నర్సాపూర్ గ్రామంతోపాటు పరిధిలోని తండాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం అయ్యింది. ఇదివరకే టీజీఎస్‌పీ డీసీఎల్ సంగారెడ్డి ఎస్‌ఈ ఐ.శ్రీనాథ్, డీఈ శ్రీనివాస్‌లు ఖేడ్‌లో పరిశీలించారు.

> **ఐదేళ్ల వరకు విద్యుత్ ఇబ్బందులు రాకుండా..**
>
> రానున్న ఐదేళ్ల కాలం వరకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సబ్‌స్టేషన్లకు ప్రతిపాదించాం. వ్యవసాయ, గృహ అవసరాలకు లోవోల్టేజీ సమస్య రాకుండా చూస్తాను. భవిష్యత్తులో ఖేడ్‌లో కర్మాగారాలు ఏర్పాటైనా విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపడుతున్నాం. ఒక 132కేవీ సబ్‌స్టేషన్ ప్రతిపాదించగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ తిమ్మాపూర్ వద్ద మంజూరైంది. మరో నాలుగు 33/11కేవీ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదించాను. త్వరలో మంజూరు కాగలవు.
>
> – డా.సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్/నారాయణఖేడ్/జహీరాబాద్ టౌన్:: రాష్ట్ర ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం 2025- 26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. బీబీఏ, బోటనీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, హిస్టరీ, తెలుగు, జువాలజీ, సబ్జెక్టులకు అదేవిధంగా ఖేడ్ ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, హిస్టరీ, కామర్స్ సబ్జెక్ట్‌లు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆయా సబ్జెక్టులలో పీజీతో పాటు ఎన్‌ఈటీ/ పీహెచ్‌డీ ఉన్నత విద్యార్హతలకు ప్రాధాన్యత ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు తమ అర్హతలను చూపుతూ సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 23 సాయంత్రం 4 గంటలలోపు ఆయా కళాశాలల్లో దరఖాస్తులను సమర్పించాలని ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

జహీరాబాద్ డిగ్రీ కాలేజీలో కూడా...

జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ అస్లాం ఫారూఖీ తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్,-1, హిందీ-1, ఉర్దూ-1. కామర్స్(ఇంగ్లిష్ మీడియం)-1, హిస్టరీ (తెలుగు మీడియం)-1, కామర్స్(ఉర్దూ మీడియం)-2, ఎకనామిక్స్ (ఉర్దూ మీడియం)-1 పొలిటికల్ సైన్స్(ఉర్దూ మీడియం)-1, బోటనీ(ఉర్దూ మీడియం)-1. జువాలజీ(ఉర్దూ మీడియం)-1, కెమిస్ట్రీ(ఇంగ్లిష్ మీడియం)-1, కెమిస్ట్రీ(ఉర్దూ మీడియం)-1, కంప్యూటర్ సైన్స్-01 తాత్కాలిక ప్రాతిపదికన బోధన గెస్టు ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన చెప్పారు. పీజీలో ఎస్‌సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో ఈ నెల 23వ తేదీ సాయంత్రం మధ్యాహ్నం 2 గంటల్లోపు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు ఈనెల 24న సంగారెడ్డి తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ఒరిజినల్ ధ్రువ పత్రాలతో ఇంటర్వ్యూ, డెమోకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9182793926 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

జైలు సూపరింటెండెంట్ సాగర్


జైలు అధికారులకు విత్తనాలనుపంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్

సంగారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కంది సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కళా సాగర్ అన్నారు. ఆదివారం కందిలోని సెంట్రల్ జైలు సిబ్బందితో కలిసి జైలులోని ఖాళీ ప్రాంగణంలో సీడ్ బాల్స్‌ను వెదజల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాల సమయంలో మొత్తం 25 వేల సీడ్ బాల్స్ పంపిణీ చేయాలన్న లక్ష్యంతో 17వేల సీడ్ బాల్స్‌ను ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని జైళ్లకు సరఫరా చేశామని తెలిపారు. మిగిలిన 8వేల సీడ్ బాల్స్‌ను ఇక్కడ నాటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఫుట్‌బాల్’ సంగ్రామం

ముస్తాబైన నవోదయం

- నేటి నుంచి మూడు రోజులపాటు పోటీలు
- జాతీయస్థాయి మెగాటోర్నీకి వర్గల్ సర్వసన్నద్ధం


క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ రిహార్సల్

వర్గల్(గజ్వేల్): పరుగులో చిరుత వేగం.. ప్రత్యర్థి ప్రయత్నాన్ని అడ్డుకుంటూ బంతిని కాళ్ల మధ్య గింగిర్లు తీయిస్తూ.. గోల్ పోస్టు వైపు దూసుకెళ్తూ.. పెనాల్టీ కార్నర్లు.. పెనాల్టీ షూటవుట్‌లు.. అరుపులు, కేరింతలతో క్రీడాకారులు మూడురోజులపాటు క్రీడాభిమానులకు కనువిందు చేయనున్నారు. ఇందుకు వర్గల్ నవోదయ వేదికకానుంది. జాతీయ ఫుట్‌బాల్ సంగ్రామానికి వర్గల్ నవోదయ సర్వసన్నద్ధమైంది. అత్యుత్తమ విద్యతోపాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్న స్థానిక నవోదయ వేదికగా సోమవారం నుంచి 3 రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో..

దేశంలోని అన్ని నవోదయ విద్యాలయాల ఫుట్‌బాల్ జట్ల క్రీడాకారులు ఆయా ప్రాంత రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. 8 రీజియన్ల నుంచి అండర్-15 విభాగంలో ఒక జట్టు, అండర్-17 విభాగంలో మరో జట్టుగా మొత్తం 16 జట్లు టోర్నీలో తలపడనున్నాయి. గ్రూప్-ఏ, గ్రూప్-బీగా జట్లను విభజించి లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తారు. టోర్నీలో విజేత జట్లు నవోదయ విద్యాలయాలన్నిటికి (నవోదయ ఒక రాష్ట్రంగా) ప్రాతినిధ్యంగా ‘ప్రీ-సుబ్రతో’ జాతీయ టోర్నీకి ఎంపికవుతారు. టోర్నీ కోసం వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 253 మంది క్రీడాకారులు, 32 మంది ఎస్కార్ట్ టీచర్లు వర్గల్‌కు చేరుకున్నారు.

సందడిగా రిహార్సల్స్

వివిధ రీజియన్ల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు, ఎస్కార్ట్ టీచర్లతో వర్గల్ నవోదయ సందడిగా మారింది. స్టేడియంలో మార్చ్‌ఫాస్ట్, ఓత్ టేకింగ్, తదితర రిహార్సల్స్ కొనసాగాయి.

నేడు టోర్నీ ప్రారంభోత్సవం

వర్గల్ నవోదయ వేదికగా ప్రీ-సుబ్రతో ఫుట్‌బాల్ జాతీయ పోటీలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ముఖ్యఅతిథిగా తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీపీ ఫల్గుణ, ప్రత్యేక ఆహ్వానితులుగా నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరా హాజరవుతున్నారు.

> **ప్రతిష్టాత్మకంగా టోర్నమెంట్**
>
> 
>
> క్లస్టర్, రీజినల్, జాతీయ టోర్నీలు సమర్థంగా నిర్వహించిన అనుభవం వర్గల్ నవోదయకు ఉంది. ప్రీ-సుబ్రతో జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహణ అవకాశం మాకు దక్కడం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాం. అందరి సహకారంతో టోర్నీ జయప్రదం చేస్తాం. నిష్ణాతులైన రెఫరీలతో పోటీలు నిర్వహిస్తున్నాం. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ పోటీలలో పాల్గొనాలి.
>
> - దాసి రాజేందర్, ప్రిన్సిపాల్

నిర్లక్ష్యపు పొగపై పోరు బాట

- కొల్లూరు డంపింగ్‌యార్డ్ తరలించాలంటున్న స్థానికులు
- గత ప్రభుత్వం 5ఎకరాల కేటాయింపు
- ఏర్పాటు నుంచి నిర్వహణ వరకు నిర్లక్ష్యమే


డంపింగ్ యార్డ్ ఎదుట ధర్నా చేస్తున్న సమీపంలోని తండా వాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులోని డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని పరిసర ప్రాంతాల గ్రామస్తులు ఉద్యమం మొదలుపెట్టారు. గతంలో స్థానికంగా డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో స్థానికులు, మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తను రోడ్లపైనే డంప్ చేసేవారు. దాంతో ప్రజలు ఇబ్బందులు పడటంతో గత ప్రభుత్వం డంపింగ్‌యార్డ్‌కు 5ఎకరాలు కేటాయించింది. కాలనీల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో చెత్తను పోగుచేసి తగలబెట్టడంతో దాని తో వచ్చే పొగతో డంపింగ్ సమీపంలోని గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు డంపింగ్‌యార్డ్ నిర్వహణలో నిర్లక్ష్యం చూపటంతో ఈ సమస్య జఠిలంగా మారింది. దీంతో డంపింగ్‌యార్డ్‌కు సమీపంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన గ్రామాల ప్రజలు ఉద్యమబాట పట్టారు.

కోట్లాది రూపాయలతో సౌకర్యాలు

డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసిన తర్వాత గత పాలకులు రూ.కోటి నిధులతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించారు. రూ.50లక్షలతో కాంపోస్ట్‌షెడ్, డై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌ను నిర్మించారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించకుండా కేవలం చెత్తను డంపింగ్ చేసి దానిని తగలబెట్టటంతో దాని నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..

మొదటి నుంచి డంపింగ్ నిర్వహణ విషయంలో అధికారులు పూరిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగానే వేలాది మంది ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలల్లో అవగాహన కల్పించడంలో అధికారులు చొరవ చూపకపోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. అవగాహన లేమితో తడి, పొడి చెత్తను కలిపి స్వచ్ఛ ఆటోలకు ఇస్తుంటే ఆ చెత్తను డంప్ చేస్తుడటంతోనే దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

> **ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి**
>
> 
>
> డంపింగ్‌యార్డ్‌పై అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెత్త నుంచి వచ్చే దుర్వాసన మా తండా వరకు వస్తుంది. అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. దీంతో సొంత ఇళ్లను వదిలి దూరప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.
>
> –శంకర్ నాయక్ , ఇరుకుంట తండా

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> గత కొద్ది రోజుల క్రితమే బదిలీపై తెల్లాపూర్ కమిషనర్‌గా వచ్చాను. వచ్చిన వెంటనే కొల్లూరు డంపింగ్ యార్డ్‌ను సందర్శించాను. అక్కడ తడి,పొడి చెత్త వేరే చేసే ప్రక్రియను మొదలుపెట్టాం. దీంతోపాటు వాటితో ఎరువులు తయారు చేసేందుకు బయో మైనింగ్ మెషీన్లను ఏర్పాటు చేశాం. దాని వలన దుర్వాసన వచ్చే అవకాశం లేదు.
>
> –అజయ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

క్లుప్తంగా

'పీఎంశ్రీ' ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకానికి ఎంపికైన పీఎంశ్రీ పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం, బుధవారం ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల ఇందిరానగర్, టీజీఎంఎస్ ఇబ్రహీంనగర్‌లలో సిద్దిపేట, రాజన్న సిరిసిల్లా జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. సిద్దిపేట జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన 81మంది, రాజన్న సిరిసిల్లాకు చెందిన 15 మంది భౌతిక రసాయన, జీవశాస్త్ర, గణితం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణలో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ప్రయోగాలతో విషయాన్ని బోధిస్తే సత్ఫలితాలు సాధించే దిశగా, ఒక్కో ల్యాబ్‌కు రూ.10 లక్షలతో భౌతిక రసాయన, గణితం, జీవశాస్త్రానికి సంబంధించిన పలు పరికరాలు అందజేశారని వివరించారు.

అధిక ధరకు యూరియా విక్రయాలు


యూరియా ధర వేయకుండా ఇచ్చిన బిల్లు

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాల్సిన యూరియాను అధిక ధరకు అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలోని మక్కరాజీపేట గ్రామంలోని ఫర్టిలైజర్ షాపులో రూ.266కు విక్రయించాల్సిన యూరియా బస్తా మూడు వందలకు అమ్ముతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తే నిర్వాహకులు స్పందించడం లేదని పేర్కొంటున్నారు. ఫర్టిలైజర్ నిర్వాహకులను యూరియాకు సంబంధించిన బిల్లు ఇవ్వమంటే కేవలం తీసుకున్న బస్తాల సంఖ్యను మాత్రమే వేసి వారు అమ్ముతున్న రేట్లు తెలియకుండా చేస్తున్నారు. అధికారులు స్పందించి యూరియాను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వలస కూలీ ఆత్మహత్యాయత్నం

చేర్యాల(సిద్దిపేట): వలస కూలీ ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఆదివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కొండపల్లి గ్రామానికి చెందిన శేఖర్ కూలీ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చాడు. పెద్దమ్మగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శేఖర్ ఆదివారం ఇంట్లో కూరగాయలు కోసే కత్తి పీటతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియలేదు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

పాముకాటుతో యువ రైతు మృతి


కంకణాల రవి

దుబ్బాక: యువరైతు పాము కాటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కీర్తిరాజు సమాచారం మేరకు... గ్రామానికి చెందిన కంకణాల రవి(39) వ్యవసాయం చేస్తూ భార్య, పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తన పొలంలో ఒడ్డుకు పెరిగిన గడ్డి చెక్కేందుకు మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. వరం చెక్కుతుండగా ప్రమాదవశాత్తు రవిని పాము కాటు వేసింది. దీంతో అక్కడే ఉన్న వ్యక్తి, కుటుంబ సభ్యులు వెంటనే రవిని చికిత్స నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రైతు మృతితో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. భార్య ఇద్దరు పిల్లలు సంజన(8), సంజశ్రీ(16 నెలల) దిక్కులేని వారయ్యారు.

రసాయనాలు తగ్గిద్దాం దిగుబడులు పెంచుదాం

- వరిలో ఎరువులను మోతాదులో చల్లాలి
- నీటి యాజమాన్యం తప్పనిసరి
- భూసారాన్ని బట్టి నిర్ణయించాలి
- తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి


పల్లవి, వ్యవసాయ శాస్త్రవేత్త

ఈ యేడు వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు సరిగా లేకపోవడంతో జిల్లాలో వరి సాగు తగ్గింది. జిల్లాలో ఇప్పటి వరకు 2.18 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. రసాయన ఎరువులను రైతులు ఏ సమయంలో వేయాలి? ఏ ఎరువులను ఏ మేరకు వాడాలి? ఎలా వేయాలో తెలియక యేటా నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వరిలో రసాయనాల వినియోగంపై తోర్నాల వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త పల్లవి రైతులకు తగు సూచనలు చేశారు.

–దుబ్బాకటౌన్

వరిలో రైతులు రసాయన ఎరువులను 80 శాతం వరకు వేస్తున్నారు. యూరియా మోతాదుకు మించి రెండు, మూడు రెట్ల అదనంగా వేస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో పొటాష్ వాడకమే లేదు. దీంతో వేస్తున్న రసాయన ఎరువులకు, వాటిని మొక్కలు వినియోగించుకుంటున్న శాతానికి మధ్య వ్యత్యాసం పెరుగుతుంది. దీని వల్ల జింక్, పొటాష్, ఇనుము మొదలగు లోపాలు ఏర్పడి నత్రజని సద్వినియోగమవడం లేదు.

పోషకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

వరిలో రసాయనాలతో పాటు సేంద్రియ ఎరువులను వాడి పోషకాలు అందించాలి. నత్రజని భాస్వరం, పొటాష్‌లను 4:2:1కు బదులుగా 9:5, 2.7:1గా అందిస్తున్నారు. నీటి యాజమాన్య పద్ధతులు సరిగా లేకపోవడం వల్ల వేసిన ఎరువులు వివిధ రూపాల్లో నష్టపోతున్నాయి. పశువులు, కోళ్లు, కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను రసాయనాలతో కలిపి వేసినట్లయితే 20 నుంచి 25 శాతం వరకు ఎరువులను ఆదా చేయవచ్చు. వరి పొలాల్లో పప్పు దినుసుల పంటలు, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం వల్ల భూసారం పెంచవచ్చు. భూసారాన్ని బట్టి ఎరువుల మోతాదును నిర్ణయించి, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్‌ను ఇచ్చే ఎరువులను సమంగా వేయాలి.


వరిలో రసాయన ఎరువులు చల్లుతున్న రైతు

నత్రజనిని మూడు సార్లు వేయాలి

ఒక ఎకరా వరికి నత్రజనిని 45 నుంచి 50, భాస్వరం 30, పొటాష్ 16, జింక్ 20 కిలోలు వేయాలి. నత్రజని ఎరువులను కాంప్లెక్స్, యూరియా రూపంలో గానీ వేయవచ్చు. నత్రజనిని మూడు సమ భాగాలుగా చేసి, నాటుకు ముందు, దుమ్ము, పిలకలు, పొట్ట దశలో వేయాలి. పొలమంతా బురదగా ఉన్నప్పుడు మాత్రమే సమానంగా వెదజల్లి 24 నుంచి 36 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. 50కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండిని కలిపి చల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది. మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్‌ను చివరి దమ్ములో సగం, పొట్ట వచ్చే సమయంలో సగం చల్లాలి. కాంప్లెక్స్ ఎరువులను పంట పొట్టకు వచ్చే దశలో వేయకూడదు. జింక్ ఎరువును భాస్వరంతో కలిపి చల్లకూడదు. కనీసం మధ్యలో ఒక్కరోజైన వ్యవధి ఉండాలి. రెండు కలిపి చల్లినట్లయితే రసాయన చర్య జరిగి ఎరువులు పని చేయకుండా అవుతాయి.

నత్రజని లోపం..

రసాయన ఎరువుల్లో నత్రజని లోపిస్తే ఆకుల మొనల నుంచి మధ్య వరకు క్రమంగా మాడిపోవడం, ముదురు ఆకులు ముందుగానే పసుపు రంగులోమారి రాలిపోతాయి. అలాగే పూత తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

భాస్వరం

భాస్వరం లోపించడం వల్ల మొక్క పెరుగుదల, పిలకలు పెట్టే శక్తి తగ్గుతుంది. వేర్ల పెరుగుదల బలహీనంగా ఉంటుంది. పూత, పంట పక్వానికి రావడం ఆలస్యమవుతుంది.

పొటాషియం, జింక్ లోపం..

పొటాషియం లోపించడం వల్ల ముదురు ఆకుల అంచులు పసుపు రంగులో మారి మాడిపోతాయి. ఆకు మొనలు గోధుమ రంగులోకి మారి దిగువ భాగానికి విస్తరిస్తుంది. తక్కువ నాణ్యతతో తక్కువ దిగుబడి వస్తుంది. జింక్ లోపిస్తే.. కనుపుల మధ్య దూరం తగ్గి, ఆకులు పలుచగా మారి, ఎదుగుదలపై ప్రభావం ఉంటుంది.

పల్లెల్లో నయా మోసం

- కారులో తిరుగుతూ పురుగు మందుల అమ్మకాలు
- రైతులు బిల్లులు ఇవ్వాలనడంతో పరారీ

చేర్యాల(సిద్దిపేట): నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించకుండా ప్రభుత్వం ఒక వైపు, వ్యవసాయశాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో కట్టడి చేస్తున్నారు. కానీ కొందరు రైతుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునేందుకు నేరుగా గ్రామాలకు వెళ్లి పురుగు మందులు అమ్ముతూ నయా మోసానికి తెర తీస్తున్నారు. ఇందుకు సాక్ష్యం ఆదివారం మండల పరిధిలోని కడవేర్గులో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... గ్రామానికి కారులో వచ్చిన కొందరు వ్యక్తులు గ్రామ కూడలి వద్ద కారును నిలిపి తాము రైతుల పంటపొలాలకు వాడే పురుగు మందులు అమ్ముతున్నామని, షాపులో కన్నా తక్కువ ధరకు ఇస్తామని కొంత మందికి విక్రయించారు. అక్కడికి చేరుకున్న వారిలో కొందరు తమకు బిల్లు ఇవ్వాలని ఏదైనా సమస్య వస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నించడంతో అక్కడి నుంచి జారుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక వ్యవసాయ, పోలీస్ అధికారులు స్పందించి ఎక్కడ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.


కారులో పురుగు మందులు అమ్ముతున్న వ్యక్తి

అనిల్‌ను చంపిన వారిపై చర్యలు తీసుకోవాలి

డీఎస్పీకి వినతిపత్రం అందజేసిన తల్లిదండ్రులు


డీఎస్పీ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అనిల్ తల్లిదండ్రులు, నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: తమ కొడుకును ఆర్థికంగా, రాజకీయంగా వాడుకున్న మా గ్రామానికి చెందిన వ్యక్తే హత్య చేయించాడని మృతుడు అనిల్ తల్లిదండ్రులు ఏసమ్మ-అనంతయ్య ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా అనిల్‌ను వాడుకున్న వ్యక్తి అతని ఎదుగుదలను అడ్డుకునే శక్తిలేక హత్య చేయించాడని ఆరోపించారు. అనిల్‌ను చంపినవాళ్లను, అందుకు కారకులైన వారిని కూడా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రోడ్డెక్కి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని.. ఇద్దరు మృతి

సిద్దిపేటఅర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి, చిన్నారి మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులో జరిగింది. త్రీటౌన్ ఏఎస్‌ఐ జయశంకర్ కథనం ప్రకారం... సిద్దిపేట వైపు నుంచి హుస్నాబాద్ వైపు ఎలక్ట్రిక్ బైక్‌పై ఓ వ్యక్తి చిన్నారితో కలిసి వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం వీరి బైకును ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని చిన్నారిని సురభి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. మృతి చెందిన వ్యక్తికి సుమారు 26 సంవత్సరాలు, పాపకు 4 సంవత్సరాలు ఉంటాయని ఏఎస్‌ఐ తెలిపారు.


ప్రమాద స్థలంలో మృతి చెందిన వ్యక్తి

స్నేహితుడిని డ్రాప్ చేయడానికి వెళ్లి..

వ్యక్తి అదృశ్యం


మహమ్మద్ ముజీబుద్దీన్

సంగారెడ్డి క్రైమ్: స్నేహితుడిని డ్రాప్ చేయడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... పట్టణంలోని హస్టల్ గడ్డకు చెందిన మహమ్మద్ ముజీబుద్దీన్ (28) వృత్తిరీత్యా కార్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న మధ్యాహ్నం 3గంటల సమయంలో తన స్నేహితుడు మహమ్మద్ ఆమేర్‌ను స్థానిక కోర్టు వద్ద తన బైక్‌పై డ్రాప్ చేయడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఈనెల 20న బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్గల్‌లో వివాహిత..


జ్యోతి

వర్గల్(గజ్వేల్): వివాహిత అదృశ్యమైన ఘటన వర్గల్‌లో జరిగింది. గౌరారం ఏఎస్‌ఐ పోచాగౌడ్ వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం జగన్‌గూడకు చెందిన ములుగు జ్యోతి(35) భర్త గోపాల్‌తో గొడవపడి కొంతకాలం నుంచి తల్లిగారి గ్రామం వర్గల్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం ఉదయం జ్యోతి బ్యాంకుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పింది. ఆ తరువాత ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం మేనల్లుడు కురాకుల ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. ములుగుకు చెందిన బుడిగె నరేష్(35)కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న గ్రామానికి చెందిన కురుమ జహంగీర్ తన పొలంలో గడ్డి మందును పిచికారీ చేసేందుకు నరేష్‌ను తీసుకెళ్లాడు. పిచికారీ చేస్తున్న సమయంలో నరేష్ కింద పడి అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 19న సాయంత్రం 4 గంటలకు అతడు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యో చిన్నారి..

- మూడు రోజుల కింద వేడి నీటిలో పడి తీవ్ర గాయాలు
- దాతల సాయం కోసం నిరీక్షణ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీహన్వి

నంగునూరు(సిద్దిపేట): మూడు రోజుల కిందట చిన్నారి ఆడుకుంటూ వెళ్లి వేడి నీటి బకెట్‌లో పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఇప్పటికే వైద్యం కోసం రెండు లక్షలు ఖర్చు కావడంతో దాతలు సహకరించి చిన్నారి ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... నంగునూరుకు చెందిన గౌరబోయిన నగేష్‌కు భార్య రమ్య, కూతురు శ్రీహన్వి (18 నెలలు), ఒక కుమారుడు ఉన్నారు. నగేష్ వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల కింద శ్రీహన్వికి స్నానం చేసేందుకు వేడి నీళ్లు పెట్టారు. ఆడుకుంటున్న పాప బకెట్‌ను పట్టుకొని జారి అందులో పడింది. తల మినహా మిగతా శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడంతో వైద్యులు కాలిన చర్మానికి ఆపరేషన్ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కూతురిని ఎలాగైనా బతికించుకోవాలని నరేష్ అందిన కాడికి అప్పు చేశాడు. వైద్యానికి ఇంకా డబ్బులు అవసరం కాగా పూర్తిగా కోలుకోవడానికి కొన్నేళ్లు పట్టే అవకాశం ఉంది. వీరి పరిస్థితిని చూసి చలించిన గ్రామస్తులు తలా కొంత ఆర్థిక సహాయం అందించారు. ఇంకా డబ్బులు అవసరం కావడంతో దాతలు అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిరుతపులి సంచారం నిజమే..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారం నిజమేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక అటవీ శాఖ సెక్షన్ అధికారి మల్లేశం, బీట్ ఆఫీసర్ మధుబాల తెలిపారు. అక్బర్‌పేట-భూంపల్లి, దౌల్తాబాద్ మండల శివారులో చిరుత పులి సంచరిస్తున్న విషయం పాఠకులకు విధితమే. కాగా ఆదివారం జంగపల్లి అటవీ శివారు ప్రాంతలో చిరుత పాద ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిన్నర వయసు కలిగిన చిరుత పులి వడ్డెపల్లి నుంచి జంగపల్లి అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు పాద ముద్రల ఆధారంగా నిర్ధారించినట్లు తెలిపారు. అడవి సుమారు 430 ఎకరాల్లో విస్తరించి ఉన్నందున చిరుత సరైన స్థిర నివాసం కోసం ప్రయత్నించవచ్చని పేర్కొన్నారు. చిరుత చిన్న వయసు కలిగి ఉండటం వల్ల పెద్ద జంతువులను వేటాడదని, చిన్న చిన్న దూడలు, కుక్కలను వేటాడుతుందన్నారు. ఎవరికైనా చిరుత తారస పడితే తనకు తానుగా వేటాడదన్నారు. దాన్ని ఏదో రకంగా భయభ్రాంతులకు గురి చేస్తే వేటాడే పరిస్థితులు ఉంటాయని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఆధారంగా చిరుతను కనిపెట్టి బంధించి, అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంత వరకు అటవీ ప్రాంతంలో గానీ, వ్యవసాయ పొలాల్లో ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పశువులను వ్యవసాయ పొలాల్లో కాకుండా ఇంటి వద్ద కట్టేసుకోవాలని సూచించారు.


చిరుత పాదాలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

అదృశ్యమై.. చెరువులో శవమై..


రాజాగౌడ్

టేక్మాల్(మెదక్): అనుమానాస్పదంగా చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పల్వంచలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కలాలి రాజాగౌడ్ (52) వ్యవసాయంతోపాటు కులవృత్తి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18న ఇంట్లోకి సామగ్రి తీసుకువస్తానని చెప్పి ఉదయం 10గంటల సమయంలో బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, గ్రామ శివారులో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం గ్రామశివారులోని చెరువులో రాజాగౌడ్ శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


జిల్లా స్థాయి కరాటేలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బెల్టులు సాధించారు. ఆదివారం మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో రెంజుకి షొటోకాన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ బెల్ట్ ఎగ్జామ్‌కు చీఫ్ ఎగ్జామినర్‌గా రెంజుకి షొటోకాన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు నగేష్ మాస్టర్ వ్యవహరించారు. జిల్లాలోని చేగుంట, రామాయంపేట, కొల్చారం, మెదక్, పెద్దశంకరంపేట మండలాలకు చెందిన సుమారు వందమంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని పలు బెల్టులలో ఉత్తీర్ణత సాధించినట్లు కరాటే మాస్టర్ దినకర్ తెలిపారు. ఈ విద్యార్థులకు కరాటే మాస్టర్ నగేష్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిత్యన్య సిరి, సూరజ్, అబ్దుల్లా, శ్రీ హర్షిత, స్వరూప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు

50మందితో చంపిస్తానంటూ బెదిరింపులు

అక్కన్నపేట(హుస్నాబాద్): యాభై మందితో చంపిస్తానని తనను ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నాడని, అతనితో తనకు ప్రాణహాని ఉందంటూ ఆదివారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో గ్రామస్తుల కోరిక మేరకు పురాతన శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో ఇటీవల ఆంజనేయ స్వామి విగ్రహం, నవగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం కొందరు ఈ గుడి స్థలంలో ఇటుకలు, గోడలను ధ్వంసం చేశారని తెలిపారు. కాగా ఆదివారం సాయంత్రం తనపై దాడి చేసే యత్నం చేశారన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్‌ను సంప్రదించగా ప్రాణహాని ఉందని సాంబరాజు ఫిర్యాదు చేశారని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

అంగవైకల్యమే అతనికి శాపమా?

- కొడుకును చదివించాలని తండ్రికి ఆశ
- బడికి వెళ్లలేని స్థితిలో కుమారుడు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

రేగోడ్(మెదక్): ఓ వైపు పేదరికం.. మరో వైపు అంగవైకల్యం. ఫలితంగా ఆ గిరిజన బాలుడు బడికి దూరమవుతున్నాడు. చదివించాలని తల్లిదండ్రులకు.. చదువుకోవాలని కుమారుడికి ఆసక్తి ఉన్నా.. అంగవైకల్యంతో బడికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలంలోని పెద్దతండాకు చెందిన శ్రీనివాస్ నాయక్, జ్యోతి కుమారుడు అశోక్ దీనావస్థను అధికారులు, పాలకులు పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

రేగోడ్ మండలంలోని పెద్దతండా రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నామని, తనకు ఇద్దరు కుమారులు ఉండగా మొదటి కుమారుడు అశోక్ పుట్టిన కొద్ది రోజులకు వికలాంగుడిగా మారాడని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కాళ్లు చచ్చుబడి లేవడానికి రావడం లేదు. అశోక్ ఎలాగైన చదవాలన్న పట్టుదలతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివాడు. ఆరో తరగతి చదవడానికి ఇతర గ్రామాలకు వెళ్లలేక ఇంటివద్దే ఉండిపోయాడు. కుమారుడికి వైద్యం చేయించినా నయం కాకపోగా అప్పులే మిగలడంతో అవస్థలు పడుతున్నామని చెప్పారు. కుమారుడికి వైద్యం చేయించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని వాపోయాడు. పెన్షన్ ఇప్పించాలని మొర పెట్టుకున్నా అధికారులు, పాలకుల నుంచి స్పందన లేదని పేర్కొన్నాడు. చదువుకోవాలని నా కుమారుడికి ఆశ ఉన్నా.. స్పందించని అధికారుల తీరుతో చదువుకు దూరమై ఇంటికే పరిమితమయ్యాడని ఆవేదన వ్యక్తం చేశాడు. కుమారుడికి బాగు కావాలని మొక్కని దేవుడు లేడు.. కోరని అధికారి లేడన్నాడు. అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకుంటే నా కుమారుడు అశోక్ మాములు మనిషి కావడానికి పెద్ద విషయమేమి కాదన్నాడు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు స్పందించి నా కుమారుడికి మెరుగైన వైద్యం అందించి, పాఠశాలకు వెళ్లేందుకు బ్యాటరీ ట్రై సైకిల్ ఇవ్వాలని తండ్రి శ్రీనివాస్ నాయక్ కోరుతున్నాడు.


తల్లిదండ్రులతో వికలాంగుడు అశోక్


రేకుల ఇంటి ముందు కూర్చున్న అశోక్